ప్రజలను పీడిస్తున్న జ్వరాలు

- వాతావరణ మార్పులతో జ్వరాలు
- క్రమేణ పెరుగుతున్న టైఫాయిడ్ కేసులు
- అధికంగా ఎక్యూట్ గ్యాస్ట్రోంటరైటిస్ సమస్యలు



ప్రత్తిపాడులోని ఎస్టీ కాలనీలో మురుగు

ప్రత్తిపాడు: పగలు ఎండ.. రాత్రి వర్షం. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, అపరిశుభ్రత వాతావరణం కారణాలతో ప్రత్తిపాడు వాసులు రోగాల బారిన పడుతున్నారు. జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమేణ పెరుగుతోంది. ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోజూ సగటున 5 నుంచి 10 మంది జ్వరపీడితులు వస్తున్నారు. వారికి ఆసుపత్రి సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులు కూడా జ్వర బాధితులతో నిండిపోతుంది.

పెరుగుతున్న టైఫాయిడ్ కేసులు..

జ్వరంతో బాధపడుతూ ప్రత్తిపాడులోని ఆసుపత్రికి వచ్చే రోగుల్లో వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వారికి వైరల్ పరీక్షలతో పాటు టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటిలో టైఫాయిడ్ జ్వరం పాజిటివ్‌గా నమోదవుతుంది. గడిచిన వారం రోజుల వ్యవధిలో ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 45 జ్వరాల కేసులు నమోదవ్వగా.. వాటిలో 14 టైఫాయిడ్ పాజిటివ్ కేసులు ఉన్నాయి. అంటే చాపకింద నీరులా టైఫాయిడ్ వ్యాపిస్తోంది.

గ్యాస్ట్రోంటరైటిస్ సమస్యలతో..

టైఫాయిడ్ బారిన ప్రజలు పడకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవడమే మేలని వైద్యులు



సామాజిక ఆరోగ్య కేంద్రం

చెబుతున్నారు. టైఫాయిడ్ వ్యాప్తికి వాతావరణంలో వస్తున్న మార్పులతో పాటు కలుషిత ఆహారం, కలుషిత నీరు కూడా కారణమని వైద్యాధికారులు చెబుతున్నారు. టైఫాయిడ్‌తో పాటు ప్రత్తిపాడు వాసులు ఎక్యూట్ గ్యాస్ట్రోంటరైటిస్ బారిన పడి ఆసుపత్రులకు వస్తున్నారు. ఇది కేవలం నీరు కలుషితమవ్వడంతోనే వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. దీని బారిన పడిన వారు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాల బారిన పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం ఉండి తగిన జాగ్రత్తలు పాటించకుంటే జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు.

> **పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..**
>
> రోజూ ఓపీలో జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. పరీక్షలు చేయగా వాటిలో టైఫాయిడ్, ఎక్యూట్ గ్యాస్ట్రోంటరైటిస్ వంటి సమస్యలు బయట పడుతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాగు నీరు, తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తగా పాటించాలి.
>
> – డాక్టర్ ప్రవీణ్, ఇన్‌చార్జి, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రత్తిపాడు

‘వెన్నుపోటు దినం’ ర్యాలీని జయప్రదం చేయాలి



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: పొన్నూరులో బుధవారం జరిగే వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు పొన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే వెన్నుపోటు దినం ర్యాలీ నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, బత్తుల గోవిందరాజులు, కొక్కిలిగడ్డ కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, చేబ్రోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. పెదకాకాని గ్రామంలోని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పార్టీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అరాచకాలు, అన్యాయాలు, దాడులతో విధ్వంసం సృష్టిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, అగతవరప్పాడు సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఉయ్యూరు సతీష్‌రెడ్డి, తాడిబోయిన వేణు, ఆలపాటి రాఘవ, కొండమడుగుల వెంకటరెడ్డి, సఫారీ బాబు, షేక్ నజీర్ అహ్మద్, బద్దెపూడి రమేష్, తాతినేని నాగేశ్వరరావు, మురికిపూడి చంద్రశేఖర్, సుంకర కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, విజయ్, షేక్ సబ్బీర తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు

ప్రత్తిపాడు: గ్రీవెన్స్ కార్యక్రమంపై అధికారులు అలసత్వం మాత్రం వీడడంలేదు. కొన్ని శాఖల అధికారులు యథావిధిగా ప్రతీ వారంలానే సోమవారం కూడా ఎగనామం పెట్టారు. హాజరైన కొన్ని శాఖల అధికారులు మాత్రం సంతకాలు పెట్టి తమ శాఖల విధులకు వెళ్లిపోయారు. వారిలో కొందరు అధికారులు తమ శాఖ విధులు చూసుకుని మరలా తిరిగి మధ్యాహ్న సమయంలో సమావేశం హాల్‌కు చేరుకున్నారు. ఇంకొందరు అధికారులు మాత్రం లోపలకు బయటకు తిరుగుతూ, ఫోనుల్లో ముచ్చటించుకుంటూ కాలక్షేపం చేశారు. కాగా తహసీల్దార్ జి.కరుణ కుమార్ కార్యాలయంలోనే అందుబాటులో ఉండి ఆయా సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఇదీ నాలుగు మాటల్లో సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ తీరు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా చేపట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం, బృందావన్ గార్డెన్స్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు మలేరియా మాసంగా పాటించి, మలేరియా నివారణ చర్యలైన, దోమకాటును నివారణ, సాయంత్రం వేప పొగ వేయడం, నీటి నిల్వలు పరిశుభ్రం చేయడం, దోమతెరలు వాడుటం, పరిసరాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో చర్యలపై ఈ నెల మొత్తం ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తద్వారా మలేరియా నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

ర్యాలీ దోమల నివారణ చర్యలపై నినాదాలు చేస్తూ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి బృందావన్ గార్డెన్స్ సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి గణేష్, డెప్యూటీ డెమో ఎన్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జిల్లాలో విద్యారంగాభివృద్ధికి ఖాసీం కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుజిల్లా విద్యారంగాభివృద్ధిలో ఖాసిం మాస్టారు తనదైన ముద్ర వేశారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పేర్కొన్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతిపై యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన షేక్ మొహ్మద్ ఖాసిం సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యాశాఖలో అజాత శత్రువుగా అధికారులు, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలగుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మట్లాడుతూ గుంటూరుజిల్లా విద్యాశాఖకు అనుబంధంగా ఖాసిం అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఖాసింను సత్కరించిన వారిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జి. వెంకటేశ్వర్లు, కె.రంగారావు, పి.హనుమంతరావు, కె.చెన్నకేశవరావు, గఫార్, ఎం. ధనరాజారావు ఉన్నారు.



ఖాసింను సన్మానిస్తున్న యూటీఎఫ్ బృందం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల పరిధిలోని కోయవారిపాలెం, కొండేపాడు, తిక్కిరెడ్డిపాలెం, రావిపాటివారిపాలెం, చినకోండ్రుపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఏఈ గౌతమ్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు, వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ప్రత్తిపాడు: విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని ఏజెన్సీల నిర్వాహకులు అందించాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో-2 జి.లీలారాణి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఎంఈవోలు సీహెచ్.రమాదేవి, లీలారాణిలు మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయన్నారు. 5వ తేదీ నుంచే ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో అందుబాటులో ఉంటారని.. ఏజెన్సీల నిర్వాహకులు కూడా పాఠశాలలకు వెళ్లి వంట గదితో పాటు పాత్రలు, పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం రుచికరంగా భోజనం తయారు చేసుకుని వచ్చిన పెదగొట్టిపాడు, తుమ్మలపాలెం, ప్రత్తిపాడు ఏజెన్సీల నిర్వాహకులకు బహుమతులను అందించారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

పొన్నూరు: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కేటాయించిన పాఠ్య పుస్తకాలను సోమవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి తరలించారు. పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి 2 కె.వి జయ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శివ లక్ష్మీ, చింతలపూడి హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్‌టీ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

కాకుమాను: పాఠశాలలు ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి స్టూడెంట్స్ కిట్‌లను అందజేయాలని ఎంఈఓ కేవీ కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు సర్వేపల్లి రాధాకృష్ణ స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో చిన్నారుల సృజన



ప్రత్తిపాడు: పర్యావరణంపై అద్భుత ఆలోచనా శక్తితో ఆలోచింపజేసే చిత్రాలను చిన్నారులు గీశారు. చేతిలో కుంచె లేకున్నా, రంగురంగుల బొమ్మలను అందంగా తీర్చిదిద్దారీ చిన్నారులు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.అరుణ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా చిన్నారులకు చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్రపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో చిన్నారులు తమ ఆలోచనలకు పదునుపెట్టి బుల్లిబుర్రల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీశారు. పొల్యూషన్ వల్ల భూమాత కన్నీరు పెడుతున్నట్లు ‘సేవ్ ఎనర్జీ స్టాప్ పొల్యూషన్’, క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా, స్వచ్ఛభారత్.. అంటూ అనేక సందేశాత్మక చిత్రాలను గీశారు.

క్లుప్తంగా

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ప్రత్తిపాడు: సూపర్ సిక్స్ హామీలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని పేదలకు 3 సెంట్ల నివాస స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో వ్యవసాయ, కార్మిక, ఏఐటీయూసీ సంఘాలు సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సోమేపల్లి వీరాంజనేయులు, ఆయా సంఘాల నాయకులు రవి, మామిడి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

హామీ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



పొన్నూరు: ఎన్నికలకు ముందు పేదలకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ విమర్శించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇళ్ల స్థలాల సాధన కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాలలో 2 సెంట్లు, పల్లెలో 3 సెంట్ల భూమిని ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్.గౌస్, రచయిత దేవరకొండ శ్రీనివాస్, షేక్.మహమ్మద్ అలీ, కోటేశ్వరమ్మ, శారద, వెంకయ్య, మహమ్మద్, యశోద, మరియమ్మ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



కాకుమాను: మహిళల ఆర్థికాభివృద్ధే విజ్ఞాన కేంద్రం లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం మహిళల 4వ బ్యాచ్‌కు కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు అరవపల్లి కృష్ణమూర్తి, దాసరి శేషగిరిరావు, నూతి బాపయ్య చౌదరి, సుబ్బారావు, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి యోగా పోటీలు

గుంటూరు రూరల్: ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల స్థాయి యోగా పోటీలను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. స్థానిక సమావేశ మందిరంలో జరిగిన ఈ పోటీల్లో సచివాలయాల పరిధిలో మెడిటేషన్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన సిబ్బంది మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కె.విద్యాసాగర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

పొన్నూరు: మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 7 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవిన్యూ 5, రేషన్ కార్డులకు సంబంధించి 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు, ఎంఏవో దేగల వెంకట్రామయ్య, హౌసింగ్ ఏఈ జాని బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు హాజరైన అధ్యాపకులు

ప్రత్తిపాడు: ఆధునిక టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే సహకారంతో వారం రోజుల పాటు ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమయ్యింది. తొలిరోజు కాకినాడ జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.బాలాజీ, ఎ.రజనిలు హాజరై ఆధునిక టెక్నాలజీ సహకారంతో బయో మెడికల్‌లో వస్తున్న విప్లవాత్మక మార్పులపై వివరించారు. అధ్యాపకులకు అవసరమైన నైపుణ్యాలను, జ్ఞానాన్ని, నూతన టెక్నాలజీ గురించి తెలుసుకుని విద్యార్థులకు బోధించవచ్చన్నారు. అధ్యాపకులు ఎఫ్‌డీపీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి ఎస్.ఆదినారాయణ ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సరళ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పెదకాకాని: రైతులు ప్రస్తుతం మార్కెట్లో ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీసౌజన్య అన్నారు. పెదకాకానిలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి మండల ఏఓ పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రతి రైతు నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పోర్టల్‌లో తమ పేరు, ఉత్పత్తి వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ఇలా చేసుకుంటే వ్యవసాయ మార్కెట్లో దళారుల ప్రమేయం లేకుండా రైతులు గిట్టుబాటు ధరకు పంటలను అమ్ముకోవచ్చన్నారు. లాం ఫాం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య లక్ష్మీ మాట్లాడుతూ.. రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సబ్సిడీ స్కీములను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివ శంకర్, ఏఈఓ రెడ్డి శివాజీ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తక్షణమే రైతు సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: మండలంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని.. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఆయన సోమవారం పెదకాకాని తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఏ పంటకూ గిట్టుబాటు ధర అందలేదని అన్నారు. దళారుల చేతిలో రైతులు దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని నమ్ముకున్న రైతులు సేద్యం చేసి గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు, రైతులకు ఇవ్వాలని కౌలు చట్టంలో సమూలమైన మార్పులు చేసి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డును ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎస్ నీలాంబరం, బి.బాబురావు, కె.సత్యనారాయణ, వి.శివయ్య, కొల్లి రంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• నిరుపయోగంగా జనరేటర్

విద్యుత్తు కోతలు, అత్యవసర సమయాల్లో తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో జనరేటర్ ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దర్శనమిస్తోంది. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో ఇలా తుప్పుపట్టిపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్దేశించిన సమయంలో పనులు చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు తహసీల్దార్ కార్యాలయాలకు జనరేటర్‌లను కేటాయించారు. మొదట్లో సక్రమంగా పనిచేశాయి. క్రమేణ వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి ఆశించిన ఫలితం రాకపోయింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయాలకు



వచ్చే ప్రజలు విద్యుత్ కోతల సమయంలో పనులు సకాలంలో జరగక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్‌ను ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకువస్తే ఆశించిన ఫలితం లభిస్తుంది ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

– పొన్నూరు

నేటి నుంచి జగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



కొత్తపేటలోని జగన్నాథస్వామి దేవస్థానం(ఫైల్)

నగరంపాలెం: స్థానిక కొత్తపేట జగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల మూడో తేదీ నుంచి తొమ్మిది వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానాల ఈఓ టి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయంస్వామి వారిని పెళ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరణ, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, పుణ్యావచన, అఖండ దీపారాధన, నవకుంభరోహణ, అగ్ని ప్రతిష్ఠ జరగనున్నాయని పేర్కొన్నారు. నాలుగో తేదీన వేణు గోపాలస్వామికి గంధంతో అలంకరణ, లక్ష్మీసుదర్శన హోమం, ఐదున స్వామికి లక్ష్మీ నరసింహ అలంకరణ, లక్ష్మీనరసింహ హోమం, ఆరున పచ్చ కర్పూర అలంకరణ, లక్ష్మీగణపతి హోమం, రాత్రి రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి తిరు కల్యాణం, ఏడున వేణుగోపాలస్వామికి తులసి అలంకరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం, స్వామి దివ్య రథోత్సవం, ఎనిమిదిన వసంతోత్సవం, చక్రస్థానం, తొమ్మిదిన లక్ష తులసీదళార్చన, రాత్రి ద్వాదశ ప్రదక్షిణాలు పవళింపు సేవ నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

వీసా ఇంటర్వ్యూలు నిలిపివేయడం అమెరికాకే నష్టం

లక్ష్మీపురం: చదువుల నిమిత్తం జారీ చేసే వీసాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మన దేశం నుంచి అక్కడకు వెళ్ళదలుచుకున్న లక్షలాది మంది విద్యార్థులను అయోమయంలోకి నెట్టిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. దీనివల్ల బిజినెస్ స్కూళ్లలో చదవదల్చుకుని, చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎదురుచూస్తున్న వారు చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. ఇంటర్వ్యూ ప్రక్రియ ఎప్పుడూ ఉంటుందో ఎంపిక ప్రక్రియలో అనుసరించబోయే విధానాలు ఎలా ఉంటాయో నన్న విషయాలు అందరినీ కలవరపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు విధానాల వల్ల అంతిమంగా నష్టపోయేది అమెరికాయేనని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు.